ప్రజాశక్తి
www.prajasakti.com
బుధవారం 27 మార్చి 2024




ఎన్నికల కోడ్ తప్పక పాటించాలి

కడప : ఎన్నికల కోడ్ అమలులో ఉన్నపుడు ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక ప్రవర్తనా నియమావళి వర్తిస్తుందని ఎన్నికల నియమావళిని తూచా తప్పక పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి వి.విజయ్ రామరాజు జిల్లాలోని ప్రతి ప్రభుత్వ ఉద్యోగులకు సూచించారు. ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకు ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి విధులను నిర్వర్తించాల్సి ఉంటుందన్నారు. ఆ మేరకు ప్రవర్తన నియమావళిని, చేపట్టాల్సిన విధులను తెలియజేశారు. ప్రభుత్వోద్యోగుల ప్రవర్తన తీరు నిష్పక్షపాతంగా ఉండాలని, ఏ రాజకీయ పార్టీకీ, అభ్యర్థికీ అనుకూలముగా వ్యవహరిస్తున్నారనే సందేహాలు, ఆరోపణలకు ఆస్కారమివ్వకూడదని చెప్పారు. ఉద్యోగులు రాజకీయ పార్టీలు నిర్వహించే కార్యక్రమంలో పాల్గొన్నా, పార్టీల నుంచి ప్రయోజనం, బహుమతులు పొందినా, అనుచితంగా ప్రభావితం చేసేందుకు ప్రయత్నించినా నియమావళికి విరుద్ధమని చెప్పారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చాక సర్టిఫికెట్లు తదితర వాటిపై రాజకీయ నాయకుల ఫొటోలు, పేర్లు, పార్టీల చిహ్నాలు వంటి వేమీ ఉండరాదని పేర్కొన్నారు.

ఎన్నికల శంఖారావానికి శ్రీకారం


- నేడు ఇడుపులపాయకు వైఎస్ జగన్
- ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు బస్సుయాత్ర
- ప్రొద్దుటూరులో మేమంతా సిద్ధం సభ



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వైసిపి సార్వత్రిక ఎన్నికల శంఖారావాన్ని మోగించింది. వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం కడప జిల్లా వేంపల్లి మండలం ఇడుపులపాయ నుంచి శ్రీకాకుళం జిల్లాలోని ఇచ్ఛాపురం వరకు 'మేమంతా సిద్ధం' సభల పేరిట బస్సుయాత్రకు శ్రీకారం చుట్టారు. జిల్లాలోని వేంపల్లి, వీరపనాయునిపల్లి, ప్రొద్దుటూరు, యర్రగుంట్ల, నంద్యాల జిల్లా మీదుగా ఆళ్లగడ్డ వరకు బస్సుయాత్ర సాగనుంది. రాష్ట్రంలోని 26 జిల్లాల వారీగా షెడ్యూల్‌ను సిద్ధం చేసింది. జిల్లాలోని ప్రొద్దుటూరులో 'మేమంతా సిద్ధం' సభను ఏర్పాటు చేశారు. జిల్లాలోని కడప, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మల మడుగు, పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున జన సమీ కరణకు ఏర్పాట్లు చేశారు. కొద్ది రోజులుగా జన సమీకరణకు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీ మొదలుకుని 36 మండలాలు, తొమ్మిది మున్సిపాలిటీ, కడప కార్పొరేషన్ కార్పొరేటర్లు, కార్పొరేషన్ ఛైర్మన్లు, డైరెక్టర్లు మొదలుకుని మండలాల నాయకత్వాలకు జనసమీకరణ బాధ్యతలను అప్పగించారు. ప్రొద్దుటూరులో మేమంతా సిద్ధం సభ నిర్వహించనున్న నేప థ్యంలో టిడిపి నుంచి భారీగా చేరికలకు అవకాశం ఉంది. ప్రొద్దుటూరు, కమలా పురం, మైదుకూరు నియోజకవర్గాల పరిధిలోని టిడిపికి చెందిన నాయకులు సహా మైనార్టీ నాయకులు చేరికలకు ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది.

- నేడు మదనపల్లికి చంద్రబాబు నాయుడు
- సిఎఎ, ఎన్ఆర్‌సి పట్ల స్పష్టతనిచ్చే అవకాశం
- రాజంపేట నుంచి భారీగా సమీకరణ



ప్రజాశక్తి-కడప ప్రతినిధి/మదనపల్లె

టిడిపి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టింది. టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు బుధవారం సాయంత్రం మదనపల్లి పట్టణంలో నిర్వహించనున్న ప్రజాగళం సభకు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. అన్నమయ్య జిల్లాలోని రాయచోటి, రాజంపేట, రైల్వే కోడూరు, మదనపల్లి, తంబళ్లపల్లి, పీలేరు నియోజకవర్గాల టిడిపి నాయకత్వం స్థానిక బెంగళూరు బస్టాండులో ప్రజాగళం సభకు ఏర్పాట్లు చేసింది. మొదటగా ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విం దును స్వీకరించిన అనంతరం ప్రసం గించనున్నారు. జిల్లాలో ముస్లిముల భయాందోళనల్ని తొలగించే ప్రయత్నం చేయడానికి ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉన్నట్లు టిడిపి వర్గాల అభిజ్ఞ. ఇటీవల కేంద్రంలోని బిజెపి సర్కారు తెచ్చిన సిఎఎ, ఎన్ఆర్‌సి చట్టాల పట్ల ముస్లిముల్లో నెలకొన్న భయాందోళనలపై స్పష్టత ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో ఐదు అసెంబ్లీ, రాజంపేట పార్లమెంట్ టిక్కెట్లపై స్పష్టత ఇవ్వడాన్ని మినహాయిస్తే రాజంపేట అభ్యర్థిత్వం తేలని నేపథ్యంలో బిజెపి, జనసేన, టిడిపి అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. రాజంపేట టికెట్ ఆశావహులు పెద్దఎత్తున జన సమీకరణ ద్వారా బలం నిరూపించే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. తాజాగా రాజంపేట అసెంబ్లీ టికెట్ కోసం పార్లమెంట్ అభ్యర్థిగా ప్రచారం జరిగిన సుగవాసి బాలసుబ్రమణ్యం కోరు తున్నట్లు సమాచారం. రాజంపేట అసెంబ్లీ ఇన్‌ఛార్జి బత్యాల చెంగల్రాయులు, జగన్మోహన్‌రాజులతోపాటు సుగవాసి బాలసుబ్రమణ్యం సైతం టికెట్ రేసులో నిలిచినట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో ఉత్కంఠ నెలకొంది.

సమస్యాత్మక కేంద్రాలపై గట్టి నిఘా

- స్ట్రాంగ్ రూముల వద్ద మూడంచెల భద్రత
- ప్రజల్లో భరోసాకు 13 కేంద్ర కంపెనీలు
- ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి
- ప్రజాశక్తితో కర్నూలు రేంజ్ డిఐజి సిహెచ్ విజయరావు



ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి/క్రైమ్

"కర్నూలు రేంజ్ పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో పోలీసు బలగాల ద్వారా గట్టి నిఘాను ఏర్పాటు చేశాం. నాలుగు జిల్లాల పరిధిలో 13 కంపెనీల కేంద్ర పోలీసు బలగాలను ఏర్పాటు చేశాం. రాష్ట్ర, జిల్లాల సరిహద్దుల్లో అక్రమ రవాణా చోటు చేసుకోకుండా చెక్ పోస్టులను ఏర్పాటు చేశాం. ఇప్పటికే పలుచోట్ల నగదును స్వాధీనం చేసుకున్నాం. లైసెన్సుడు గన్నులను డిపాజిట్ చేసుకున్నాం. ప్రతి పార్లమెంటు పరిధిలోని స్ట్రాంగ్ రూముల వద్ద భద్రతను ఏర్పాటు చేశాం" అని కర్నూలు రేంజ్ డిఐజి సిహెచ్ విజయరావు తెలిపారు. ప్రజాశక్తి ముఖాముఖిలో ఎన్నికల నిర్వహణ భద్రత ఏర్పాట్లకు సంబంధించిన పలు విషయాలను వెల్లడించారు...

ఎన్ని పోలీసు కంపెనీ బలగాలను కేటాయించారు?

డిఐజి : కర్నూలు రేంజ్ పరిధిలోని కర్నూలు, నంద్యాల, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లాల పరిధిలో మొత్తం 13 పోలీసు కంపెనీ బలగాలను ఏర్పాటు చేశాం. ఒక్కొక్క జిల్లాకు మూడు కంపెనీల చొప్పున 12 కంపెనీలు కాగా ఒక నంద్యాలకు నంద్యాల జిల్లాకు మాత్రం నాలుగు కంపెనీలను కేటాయించాం. ఆయా జిల్లాల్లో సమస్య ఆత్మక ప్రాంతాలను గుర్తించి కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్, కవాతు నిర్వహిస్తున్నాం.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారా?

డిఐజి : కడప జిల్లాలో 513, అన్నమయ్య జిల్లాలో 400, నంద్యాల జిల్లాలో 370, కర్నూలు జిల్లాలో 320 కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించాం. అక్కడ ఆర్మడ్ రిజర్వ్‌డ్ పోలీసు బలగాలతో గట్టి బందోబస్తును ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ప్రత్యేక రూటు ఆఫీసర్లను ఏర్పాటు చేసి ఆ రూట్లో ఒక వాహనంతో పాటు ఐదుగురు సిబ్బంది ఉంటారు. ఏదైనా ఫోన్ కాల్ ద్వారా ఫిర్యాదు అందితే వెంటనే అక్కడికి వెళ్లి సమస్యను పరిష్కరిస్తారు.

ఫ్యాక్షన్ గ్రామాల్లో నేరాల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డిఐజి : కర్నూలు రేంజ్ పరిధిలో కర్నూలు జిల్లాలో 27, నంద్యాల జిల్లాలో 28, కడప జిల్లాలో 67 గ్రామాలను ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలుగా గుర్తించాం. అక్కడ ఫ్యాక్షన్ జోన్ పరిధిలో ప్రత్యేక ఇన్స్పెక్టర్లను కేటాయించాం. గత పది ఏళ్లలో ఎవరు ఫ్యాక్షన్ కార్యకలాపాలను ప్రేరేపిస్తున్నారో గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టిని ఉంచాం. ఎన్‌బిడబ్ల్యులను పూర్తిచేశాం. ఎన్నికల్లో సమస్యలు సృష్టించే వ్యక్తులను ఎమ్మార్వో సమక్షంలో బైండోవర్ కేసులను నమోదు చేశాం.

ఎన్ని లైసెన్సుడు గన్నులను స్వాధీనం చేసుకున్నారు ?

డిఐజి : బ్యాంకుల వద్ద ఉన్న లైసెన్సుడు గన్నులు మినహా అన్ని లైసెన్సుడు గన్నులను స్వాధీనం చేసుకుంటున్నాం. ఇప్పటివరకు కర్నూలు జిల్లాలో 577, నంద్యాల జిల్లాలో 779, కడప జిల్లాలో 678, అన్నమయ్య జిల్లాలో 764 లైసెన్సుడు గన్నులను స్వాధీనం చేసుకున్నాం.

స్ట్రాంగ్ రూముల వద్ద ఎలాంటి భద్రత చర్యలు తీసుకుంటున్నారు?

డిఐజి : పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఒకటి చొప్పున ఏర్పాటు చేసే స్ట్రాంగ్ రూముల వద్ద మూడు అంచల భద్రత వ్యవస్థతో కట్టుదిట్టం చేస్తున్నాం. మొదటి వ్యవస్థలో కేంద్ర పోలీసు బలగాలు, రెండో వ్యవస్థలో ఏపీఎస్పీ బలగాలను, మూడవ వ్యవస్థలో జిల్లా పోలీసు బలగాలతో కట్టుదిట్టం చేస్తున్నాం. జాయింట్ లెవెల్ ఆఫీసర్లతో భద్రతను పర్యవేక్షిస్తున్నాం.

నాటుసారా తయారీ, మద్యం అక్రమ రవాణాపై ఎలాంటి నివారణ చర్యలు తీసుకుంటున్నారు?

డిఐజి : నాలుగు జిల్లాల పరిధిలో ఎక్కడైనా నాటుసారా బట్టీల ఏర్పాటు, తయారీ, రవాణా, రాష్ట్ర ఇతర మద్యం రవాణపై ప్రత్యేక దృష్టిని సారిస్తున్నాం. ఎన్ఫోర్స్మెంట్ పోలీసులతో దాడులు నిర్వహించి కేసులు కడుతున్నాం. అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులు కర్నూలు జిల్లాలో 8, నంద్యాల జిల్లాలో రెండు, అన్నమయ్య జిల్లాలో ఒకటి ఉన్నాయి. జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులు ఒక్కో జిల్లాలో 10 పైగా ఉన్నాయి. చెక్ పోస్టుల్లో నగదును, అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని సీజ్ చేస్తున్నాం. కర్నూలు జిల్లాలో రూ.2.45 కోట్లు, నంద్యాల రూ 37 లక్షలు, కడప రూ.10.71 కోట్లు, అన్నమయ్య జిల్లాలో దాదాపు రూ.37 లక్షలు నగదును స్వాధీనం చేసుకున్నాం. లిక్కర్ కేసులు కడపలో 1000 పైగా, కర్నూలు 360, నంద్యాల 250, అన్నమయ్య 650 పైబడి కేసులు నమోదు చేశాం. ఇప్పటి వరకు సి-విజిల్ యాప్‌లో 80 ఫిర్యాదులు నాలుగు జిల్లాల పరిధిలో అందగా వాటిని ఆయా జిల్లాల్లో ఎస్పీలు పరిష్కరిస్తున్నారు. నంద్యాల జిల్లా నల్లమల అటవీ ప్రాంతంలో ఒక షాడో జోన్ ఉంది. కర్నూలు రేంజ్ పరిధిలోని మిగిలిన అన్ని ప్రాంతాల్లో రోడ్డు, ఫోన్ కమ్యూనికేషన్ ఉన్నాయి. ఎన్నికల నిర్వహణకు ఎవరు విఘాతం కలిగించినా కఠినంగా చర్యలు తీసుకుంటాం. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలి.

ముందస్తు ప్రణాళికతో నీటి ఎద్దడిని అధిగమిద్దాం

- వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి
- జిల్లా వ్యాప్తంగా విరివిగా చలివేంద్రాలు ఏర్పాటు
- కలెక్టర్ వి.విజయ్‌రామరాజు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వి.విజయ్‌రామరాజు

ప్రజాశక్తి - కడప

ముందస్తు చర్యలు చేపట్టి తాగునీటి కొరత, వడదెబ్బ వంటి వేసవి సమస్యలను అధిగమించాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో 'తాగునీటి కొరత, వేసవి వడగాల్పులు, వడదెబ్బ, ముందస్తు జాగ్రత్త చర్యలు' పై జెసి గణేష్ కుమార్, నగర కమిషనర్ ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిఆర్ఒ గంగాధర్‌గౌడ్‌తో కలిసి కలెక్టర్ వి.విజయ్ రామరాజు జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది ముందస్తుగానే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో దీనిపై ప్రజలు అత్యంత జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రెండు నెలల పాటు ఇదే పరిస్థితి ఉండే ప్రమాదం ఉన్నందున ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజలకు తాగునీటి వసతి, ఆరోగ్య సంరక్షణ సహాయ సహకారంతో ముందుకు వచ్చే స్వచ్ఛంద సంస్థలు ఎక్కడా కూడా రాజకీయ పార్టీల ప్రమేయాన్ని అనుమతించకూడదన్నారు. రాజకీయ నాయకులతో ప్రారంభోత్సవాలు చేయడం, పార్టీ గుర్తులను ఉపయోగించడం కోడ్‌ను ఉల్లంఘించినట్లే అన్నారు. అన్ని మండలాల్లో ఎక్కడా తాగునీటి కొరత లేకుండా ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, ఆర్డబ్ల్యుఎస్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అందులో భాగంగా విరివిగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు స్థానిక ఎఎన్ఎంతో సమన్వయం చేసుకుని వడగాల్పులపై ప్రజలకు అవగాహన కల్పించేలా, అలాగే తగినన్ని ఒఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామీణ ఉపాధి హామీ పనులు జరిగే ప్రాంతంలో షెడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించడంతో పాటు తగినన్ని ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని డ్వామా అధికారులను ఆదేశించారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఆయా అంగన్వాడీ వేసవి వడగాల్పులపై సిడిపిఒ, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ వర్కర్ల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నపిల్లలు, గర్భిణీల సౌలభ్యం కోసం ముందస్తుగా ఒఆర్ఎస్ ద్రావకాలను సిద్ధంగా ఉంచాలన్నారు. విద్యార్థులకు వడగాల్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత అవగాహన కల్పించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఆర్‌టిసి బస్టాండ్, రైల్వే స్టేషన్‌లలో తాగు నీటి వసతితో పాటు ప్రథమ చికిత్సకు అవసరమైన ఏర్పాట్లను సిద్ధంగా ఉంచుకునేలా చర్యలు చేపట్టాలని రైల్వే, ఆర్టీసీ శాఖల స్టేషన్, జోనల్ మేనేజర్లను కలెక్టర్ ఆదేశించారు. అన్ని మండలాల్లో జనసమూహాలు ఉన్నచోట విరివిగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో రద్దీగా ఉండే ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గర గ్రీన్ తెరలను ఏర్పాటు చేయించాలన్నారు. డిఆర్‌డిఎ, మెప్మా శాఖల ఆధ్వర్యంలో మహిళా సమాఖ్యల ద్వారా అవసరం ఉన్న చోట మంచినీటి చలివేంద్రాల నిర్వహణ బాధ్యతను అప్పగించాలన్నారు. ఎండ సమయంలో ఆరుబయట అధిక శారీరక శ్రమతో కూడిన పని చేసేవారు, వేసవి సీజన్లో పాటించాల్సిన జాగ్రత్తలు తప్పక పాటించాలన్నారు. కార్యక్రమంలో జడ్‌పి సిఇఒ సుధాకర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.నాగరాజు, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఇ వీరన్న, ఇరిగేషన్ అధికారులు, అనుబంధ శాఖల జిల్లా అధికారులు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్డబ్ల్యుఎస్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

ఆత్మహత్యలపై న్యాయ విచారణ చేపట్టాలి

- వామపక్ష నాయకుల డిమాండ్
- డిఆర్ఒకు వినతి



డిఆర్ఒకు వినతి పత్రం అందజేస్తున్న వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

మాధవరం గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు భూ సమస్య కారణంగా ముగ్గురు ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనపై సమగ్రమైన న్యాయవిచారణ కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించాలని వామపక్ష, రైతు, వ్యవసాయ, కార్మిక, సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా రెవెన్యూ అధికారికి వినపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ, సిపిఎం జిల్లా కార్యదర్శులు జి. చంద్ర, జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఒంటిమిట్ట మండలం మాధవరం గ్రామానికి చేనేత కుటుంబానికి చెందిన సుబ్బారావు, భార్య పద్మావతి, కూతురు వినయ ఆత్మహత్యకు కారకులైన రెవెన్యూ అధికారులు, అధికార పార్టీ నేతలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయ విచారణ చేపట్టి మృతుని కుమార్తెకు ప్రభుత్వ ఉద్యోగం, భూమి, ఆత్మహత్య చేసుకున్న కుటుంబానికి ఒక్కొక్కరికి రూ.25 లక్షల ఎక్స్ గ్రేషియ ఇవ్వాలని కోరారు. భూ అక్రమణకు పాల్పడిన అప్పటి తహశీల్దారు, రెవెన్యూ అధికారులను ప్రభుత్వ ఉద్యోగం నుంచి తొలగించాలని తెలిపారు. ఒంటిమిట్ట మండలంలో వందల ఎకరాల ప్రభుత్వ భూములు అధికార పార్టీ రాజకీయ నాయకుల అండదండలతో కబ్జాలకు గురవుతున్నాయని పేర్కొన్నారు. జిల్లా రెవెన్యూ ఉన్నత అధికారులు చోద్యం చూస్తున్నారని అన్నారు. సీఎం సొంత జిల్లాలో అధికార పార్టీ నాయకులు బరితెగించి భూ కబ్జాలకు పాల్పడుతున్నారని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు. ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబాలకు జిల్లా ఉన్నతాధికారులు అండగా నిలబడాలని, అన్ని విధాలుగా ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి, అధ్యక్షులు సుబ్బారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివకుమార్, అన్వేష్, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శివ నారాయణ, రైతు సంఘం నాయకులు కట్ట యానాదయ్య, సిపిఎం నగర కార్యదర్శి రామ్మోహన్, కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, సిపిఐ నాయకులు బాదుల్లా, సిపిఐ ఎంఎల్ నాయకులు అంకన్న, రవికుమార్ పాల్గొన్నారు.

సుబ్బారావు కుటుంబాన్ని ఆదుకోవాలి

మాధవరంలో త్మహత్య చేసుకున్న కుటుంబాన్ని ఆదుకోవాలని బిసి సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ మాట్లాడుతూ ఒంటిమిట్ట మండలం మాధవరం గ్రామానికి చేనేత కుటుంబానికి చెందిన సుబ్బారావు, భార్య, పద్మావతి,కూతురు వినయ, ఆత్మహత్యకు కారకులైన రెవెన్యూ అధికారులు, అధికార పార్టీ నేతల పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. న్యాయ విచారణ జరపాలని మృతుని కుమార్తెకు ప్రభుత్వ ఉద్యోగం, భూమి, ఆత్మహత్య చేసుకున్న కుటుంబానికి ఒక్కొక్కరికి రూ.30 లక్షల ఎక్స్ గ్రేషియ ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిఎస్‌పి కేసును తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించడం సరైంది కాదని తెలిపారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి తమకు తోచిన ఆర్థిక సాయం అందజేశామని చెప్పారు. మూడు ఎకరాల స్థలాన్ని తిరిగి మృతుని కూతురు పేరుతో ఆన్లైన్ చేయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు లింగమూర్తి, పార్లమెంటు అధ్యక్షులు రామాంజనేయులు, కళ్యాసుధాకర్, గోవిందు నాగరాజు, త్రివిక్రమరావు, సుబ్బారావు, ఆదినారాయణ, నరసింహ, సంటెన్న పాల్గొన్నారు.

ప్రచారాలకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి - కడప

ఎన్నికల ప్రచార కార్యకలాపాలు చేపట్టాలనుకున్న రాజకీయ పార్టీల ప్రతినిధులు కేంద్ర ఎన్నికల సంఘం నియమ నిబంధనల మేరకు ముందస్తు అనుమతి పొందాల్సి ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి వి.విజయ్ రామరాజు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో సాధారణ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతోసమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచార కార్యక్రమాలు నిర్వహించుకోలనే రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పనిసరిగా సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల వద్ద అనుమతి పొందాలన్నారు. అనుమతి లేకుండా ప్రచార కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. నాయకుల ర్యాలీలు, స్టార్ క్యాంపెయిన్, రోడ్ షో లాంటి కార్యక్రమాల కోసం 48 గంటల ముందే అనుమతి తీసుకోవాలన్నారు. డోర్ టూ డోర్ ప్రచారానికి కూడా పర్మిషన్ తప్పక తీసుకోవాలన్నారు. ఇప్పటికే మోడల్ కోడ్ కాండక్ట్ (ఎంసిసి) పై రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులకు, ప్రజలకు మీడియా ద్వారా అవగాహన కల్పించామని చెప్పారు. ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను సంసిద్ధం చేశామని, జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా జిల్లా వ్యాప్తంగా మోడల్ కోడ్ ఉల్లంఘన చర్యలపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టడం జరుగుతోందన్నారు. సువిధ సర్వీసు ద్వారా మంగళవారం నాటికి 271 అనుమతుల కోసం దరఖాస్తులు రాగా అందులో 165 దరఖాస్తులకు అనుమతులు ఇచ్చామని చెప్పారు. ఎన్నికల విధుల్లో భాగంగా కేవలం ప్రభుత్వ ఉద్యోగులు, హెచ్ఆర్. పాలసి నియామక ఉద్యోగులకు మాత్రమే విధులు కేటాయించారని పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం అభ్యర్థులు ప్రచార నిమిత్తం వినియోగించే బ్యానర్లు, జెండాలు, టోపీలు, వివిధ మాధ్యమాల ద్వారా ప్రచారం నిర్వహించే అడ్వర్‌టైజ్‌మెంట్‌కు సంబంధించిన రేటింగ్ కార్డు ఇస్తారన్నారు. పార్టీ అభ్యర్థులు పర్మిషన్ తీసుకున్న ప్రకారమే ఖర్చు చేయాలన్నారు. పార్టీల అభ్యర్థులు సభలు, సమావేశాలు నిర్వహించాలనుకుంటే 48 గంటల ముందే అనుమతులు తీసుకొని సభలు నిర్వహించుకోవాలన్నారు. ఎంసిసి, ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో వ్యూయింగ్ టీం, తదితర టీములు జిల్లా వ్యాప్తంగా పర్యవేక్షిస్తున్నాయన్నారు. జిల్లాలో ఎక్కడైనా అధికారులు కానీ, పార్టీల ప్రతినిధులు కానీ ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్నట్లు మీ దృష్టికి వస్తే సి.విజిల్ యాప్ ద్వారా, లేదా కమాండ్ కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1950 లేదా కాల్ చేసి తెలిపితే వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు బి.హరిప్రసాద్, డాక్టర్ బి.శ్రీనివాసులు, జి.చంద్రశేఖర్, ఎన్నికల నోడల్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు నిర్భయంగా తెలియజేయాలి

- సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్

ప్రజాశక్తి - కడప

సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ మంగళవారం కడపలోని పురుషుల కేంద్రకారాగారాన్ని సందర్శించారు. ఖైదీల కుటుంబ సభ్యుల కోసం ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందేందుకు న్యాయ సలహాలు, సహాయం అందించడం మొదలగు అంశాలపై న్యాయ విజ్ఞాన సదస్సు అక్కడ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖైదీల కుటుంబ సభ్యుల కోసం ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందేందుకు న్యాయ సలహాలు, సాయం అందించడం తదితర అంశాలపై వివరించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడప వారిని సంప్రదించవచ్చు అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపర్డెంట్ జవహర్ బాబు, రమేష్, వైద్యాధికారి, ఖైదీలు వారి బంధువులు పాల్గొన్నారు . అనంతరం పురుషుల కేంద్ర కారాగారంలో ఉన్న లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను సందర్శించారు. పారా లీగల్ వాలంటరీలతో మాట్లాడుతూ ఖైదీల సమస్యలు ఏవైనా ఉంటే అర్జీల రూపంలో తీసుకొని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం ద్వారా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థకు పంపాలని సూచించారు. మహిళా కేంద్ర కారాగారాన్ని సందర్శిస్తూ మహిళ ఖైదీల కుటుంబ సభ్యులు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందేందుకు న్యాయ సలహాలు అందించారు. ఆయన వెంట ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ భువనేశ్వరి, డిప్యూటీ జైలర్, మహిళా పారా లీగల్ వాలంటరీలు, మహిళ ఖైదీలు పాల్గొన్నారు.

ఐ.ఎన్.సుబ్బమ్మకు భర్త వియోగం

ప్రజాశక్తి -కడప అర్బన్



చంద్రాయుడు

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఐ.ఎన్.సుబ్బమ్మ భర్త చంద్రాయుడు (80) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. వారం రోజులుగా రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యం క్షీణించడంతో మరణించారు. చంద్రాయుడు మృతి పట్ల సిపిఎం జిల్లా కమిటీ సంతాపం ప్రకటించింది. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపింది. బుధవారం ఉదయం 9 గంటలకు దహన క్రియలు ఉంటాయని కుటుంబ వర్గాలు తెలియజేశాయి.

ప్రభుత్వానికి బిసిలు, బ్రాహ్మణులు బుద్ధి చెప్పాలి

ప్రజాశక్తి - కడప

త్వరలో జరగబోవు ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి బిసిలు, బ్రాహ్మణులు బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాములు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని బిసిలు, బ్రాహ్మణులందరూ వచ్చే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని తెలిపారు. రాష్ట్రంలో పేదలను చంపి వారి రక్తాన్ని అన్నంలో కలుపుకొని తినే సంస్కృతి ఉందని విమర్శించారు. ప్రపంచానికి నాగరికత నేర్పిన చేనేతలను అతి దారుణంగా హింసించి వేధిస్తూ అన్యాయంగా పొట్టన పెట్టుకుంటున్నారని వాపోయారు. కష్టపడి సంపాదించుకున్న ఆస్తులకు కూడా రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాకినాడ శివాలయంలో అర్చకులుగా పనిచేస్తున్న సాయి శర్మ, విజయ్ కుమార్ శర్మ పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. దాడికి పాల్పడిన నిందితుడికి మద్దతిస్తున్న ఆలయ ఇఒ, కాకినాడ జిల్లా దేవాలయ శాఖ అధికారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. వైసిపి అధికారంలోకి వచ్చినప్పుడు నుండి అర్చకులపై దాడులు పెరిగాయన్నారు. బ్రాహ్మణ సంక్షేమాన్ని తుంగలో తొక్కిన వైసిపికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. జిల్లాలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని జిల్లా అధికారులను కోరారు. వైఎస్ఆర్ జిల్లాలోని 36 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని కోరారు.

సిఎం జగన్‌కు ఓట్లు అడిగే హక్కు లేదు : టిడిపి

కడప అర్బన్ : జిల్లా అభివృద్ధిలో నిర్లక్ష్యం వహించిన సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఓట్లు అడిగే హక్కు లేదని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం ద్వారక నగర్‌లోని తన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉక్కు పరిశ్రమ కోసం 3 సార్లు సిఎం జగన్ శంకుస్థాపన చేశారని పేర్కొన్నారు. ఇంతవరకు ఒక్క ఇటుక కూడా పడలేదని విమర్శించారు. జిల్లాకు ఇచ్చిన హామీలు ఈ ఐదేళ్లల్లో నిలబెట్టుకోలేదని తెలిపారు. ఆల్విన్, చక్కెర, పాలపరిశ్రమలు తెరిపిస్తామన్న హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. బెంగుళూరు - కడప రైల్వేలైన్ వద్దని సిఎం, ఎంపీ అవినాష్‌రెడ్డి కేంద్రానికి లేఖలు రాశారని చెప్పారు. రిమ్స్ సమీపంలో ఐటి సెజ్ భూములను షిరిడి సాయి ఎలక్ట్రికల్స్‌కు కేటాయించి పరిశ్రమలు రాకుండా చేశారని విమర్శించారు. ఒక్క నీటి ప్రాజెక్టు పూర్తి చేయలేదన్నారు. బండికనుమవద్ద పెన్నా నదిపై చెక్ డ్యాం నిర్మించేందుకు టిడిపి ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తే వైసిపి రద్దు చేసిందని పేర్కొన్నారు. దీంతో నగరంలో నీటి సమస్య అధికమైందని తెలిపారు. సుందరీకరణ పేరుతో సర్కిల్స్‌లో పనులు చేస్తూ ప్రజలను 5 నెలల నుంచి ట్రాఫిక్ ఇబ్బందులకు గురి చేస్తూ ఉన్నారని విమర్శించారు. జిల్లాలో కరువు విలయతాండం చేస్తుంటే కరువు మండలాలుగా ప్రకటించకపోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన సహాయం రాకుండా రైతులను వైసిపి నట్టేట ముంచిందని విమర్శించారు.

రంజాన్ వేళలు



ఇఫ్తార్	షహారీ
బుధవారం (సా)	గురువారం (ఉ)
6.30	4.58



మాట్లాడుతున్న చైర్మన్లు, వైసిపి నాయకులు

బస్సు యాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బుధవారం చేపట్టనున్న బస్సు యాత్రను జయప్రదం చేయాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, సివిల్ సప్లయ్ డైరెక్టర్ హాల్ గంగాధర్ రెడ్డి, నూర్‌బాషా సంఘం డైరెక్టర్ రసూల్, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, జేసీసీ కన్వీనర్ చంద్రమౌళి, కౌన్సిలర్లు కోడి రమణ, కిషోర్ పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం స్థానిక వైఎస్ మనోహర్‌రెడ్డి ఇంటిదగ్గర నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నిర్వహిస్తున్న ఇడుపులపాయ నుండి ఇచ్చాపురం వరకు నిర్వహించే బస్సు యాత్రను ప్రతి పార్టీ కార్యకర్త పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : ప్రొద్దుటూరులో బుధవారం సాయంత్రం జరిగే సిద్ధం సభను విజయవంతం చేయాలని, జమ్మలమడుగు నియోజవర్గం నుంచి భారీ సంఖ్యలో తరలిరావాలని వైసిపి నేత వల్లంబాయి హృషికేశవరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ఇచ్చిన మేనిఫెస్టోను పూర్తిగా అమలు చేశామా లేమా తెలపడమే సిద్ధం సభ ముఖ్యఉద్దేశ్యమన్నారు. రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేసిన ప్రజల ముఖ్యమంత్రి మన జగన్మోహన్‌రెడ్డి అన్నారు.

ఇడుపులపాయలో బస్సు యాత్రకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - వేంపల్లె

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం నుంచి చేపట్టనున్న బస్సు యాత్ర (మేమంతా సిద్ధం)కు ఇడుపులపాయలో ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మేమంతా సిద్ధం పేరుతో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ఇడుపులపాయ నుండి శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురం వరకు బస్సుయాత్ర చేయనున్నారు. బుధవారం మధ్యాహ్నం ఇడుపులపాయకు చేరుకుంటారు. అనంతరం వ్యవసాయ క్షేత్రంలో ఉన్న వైఎస్ఆర్ సమాధి వద్ద ప్రార్థనలు చేసి, అక్కడి నుంచి మారుతీనగర్, వీరన్నగట్టుపల్లె, కుమ్మరాంపల్లె మీదుగా వేంపల్లెకు బస్సు యాత్ర చేరుకుంటుంది. వీరపునాయునిపల్లె, ఎర్రగుంట్ల మీదుగా సాయంత్రం ప్రొద్దుటూరుకు చేరుకుంటుంది. ప్రొద్దుటూరులో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో సిఎం జగన్ ప్రసంగిస్తారు. అనంతరం అక్కడి నుంచి నంద్యాల జిల్లా ఆళ్ళగడ్డకు దువ్వూరు, చాగలమర్రి మీదుగా చేరుకుని రాత్రికి బస చేస్తారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలో హెలిప్యాడ్, వైఎస్ఆర్ ఘాట్ వద్ద వైసిపి నాయకులు ఏర్పాట్లు చేశారు. భద్రత ఏర్పాట్లుపై కూడా పోలీసులు ముమ్మరం చేశారు.

'బొజ్జల' వ్యాఖ్యలపై వాలంటీర్ల నిరసన

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

తమపై బొజ్జల సుధీర్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై పట్టణంలోని వాలంటీర్లు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నెల ఒకటో తేదీన ఉదయం 5 గంటల నుంచి పెన్షన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ఏ వీధి చివరలో ఆగి చూసిన కనిపిస్తుందన్నారు. అలాంటిది మీకు కనిపించలేదా అని వారు ప్రశ్నించారు. అలాగే ప్రతి నెల పదవ తేదీలోపు రైస్ బండి వద్ద వాలంటీర్ కనిపించడం లేదా అన్నారు. ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు తాము చేస్తున్నప్పటికీ బొజ్జల సుధీర్‌రెడ్డి మమ్మల్ని టెర్రరిస్టులుగా మాట్లాడడం సరైన పద్ధతి కాదన్నారు. ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు వాలంటీర్లపై చేయడం తగునా అని వారు నిలదీశారు. వెంటనే మీ ఆరోపణలు సరైనవి కాదని తప్పు తెలుసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిచో తీవ్ర పరిణామాలు తప్పవని వారు హెచ్చరించారు.

నిరుద్యోగులకు ఉచిత డ్రైవింగ్ శిక్షణ

వేంపల్లె : నిరుద్యోగ యువతీయువకులకు ఉచిత డ్రైవింగ్ శిక్షణ ఇస్తున్నట్లు వివేక్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షురాలు బాలిగాళ్ల జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. కందుల శివానందరెడ్డి పేరు మీద నిరుద్యోగ యువతకు డ్రైవింగ్ శిక్షణనిస్తున్నట్లు చెప్పారు. 18 నుంచి 25 సంవత్సరాలలోపు వయసుగల నిరుద్యోగ యువత దరఖాస్తులను బిఎన్ఆర్ డ్రైవింగ్ స్కూల్‌లో అందజేయాలని కోరారు. పదో తరగతి సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, 4 పాసుపోర్టు సైజ్ ఫొటోలు తీసుకొని ఈ నెల 31లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు చేసుకున్న వారికి ఏప్రిల్ 1నుండి డ్రైవింగ్ శిక్షణనిస్తామన్నారు. వివరాలకు బిఎన్ఆర్ డ్రైవింగ్ స్కూల్ కరస్పాండెంట్ నాగేంద్ర 87900 14146, 93817 35656ను సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

చాపాడు : చాపాడు మండల పరిధిలో జరుగుతున్న 10వ తరగతి పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా నిర్వహించామని ఎంఇఒ రవిశంకర్ తెలిపారు. చాపాడు పరీక్షా కేంద్రంలో 296 మంది విద్యార్థులకు గానూ 284 మంది విద్యార్థులు హాజరు కాగా 12 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. లక్ష్మీపేట పరీక్షా కేంద్రంలో 127 మందికిగానూ అందరూ హాజరయ్యారని తెలిపారు. బుధవారం చివరి పరీక్ష ఉంటుందని ఆయన తెలిపారు.

క్రైం కార్నర్





ప్రమాదానికి గురైన బొలెరో వాహనం, అక్కడికక్కడే మృతి చెందిన ప్రసాద్

దైవ దర్శనానికి వెళ్లి వస్తూ ...

బొలెరో అదుపుతప్పి ధర్మవరానికి చెందిన ఇద్దరు మృతి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

దైవ దర్శనానికి వెళ్లి వస్తు ఘోర రోడ్డు ప్రమాదం జరగడంతో ఇద్దరు మృతి చెందారు. ఎస్ఐ అనిల్ కుమార్ కథనం మేరకు.. అనంతపురం జిల్లా ధర్మవరం నుంచి కర్నూలు జిల్లాలోని అహోబిలం నరసింహ స్వామిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో ఈ ప్రమాదం జరిగింది. మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో మండలంలోని గురజాల సమీపంలో బొలెరో అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో ధర్మవరం పట్టణంలోని కేతిరెడ్డి కాలనీకి చెందిన డేరంగుల ప్రసాద్ (32) ప్రమాద స్థలంలోనే మృతి చెందగా.. తీవ్ర గాయాలైన వెంకటమ్మ(80)ను 108 సిబ్బంది పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ప్రమాదంలో సునీత, నవీన్ కృష్ణ, చరణ్ తేజ్, వెన్నెల మరికొంతమందికి గాయాలయ్యాయి.

ఘర్షణలో గాయపడిన యువకుడు మృతి

ప్రజాశక్తి - వేంపల్లె



నరసింహ (ఫైల్‌ఫొటో)

వేంపల్లెలోని గండి రోడ్డులో జరిగిన ఘర్షణలో గాయపడి చికిత్స పొందుతున్న నరసింహ (18) అనే యవకుడు మంగళ వారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. రెండు రోజుల క్రితం శ్రీరాం నగర్‌కు చెందిన వారు గండి రోడ్డులో కత్తులతో దాడులు చేసుకోవడంతో వేంపల్లెకు చెందిన నలుగురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమం కావడంతో గాయపడిన వ్యక్తులను కడప రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో నరసింహ చికిత్స పొందుతూ మృతి చెందాడు. నరసింహ బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తుడుమలదిన్నెలో తాగునీటికి కటకట

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలం పరిధిలోని తుడమలదిన్నె గ్రామ దళితవాడలో ప్రజలు తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు నెలలు నుంచి నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో కొందరు స్థానికులు ట్యాంకర్స్ ఏర్పాటు చేసి నీటిని అందిస్తున్నారు. ఎమ్మార్పిఎస్ నాయకులు చాట్ల విజయ్‌భాస్కర్, రాజారత్నం, జయరాజు సహకారంతో ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తున్నారు. తాగునీటి సరఫరా విభాగ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



ట్యాంకర్ నీటి కోసం ఎదురుచూస్తున్న మహిళలు

ఖాళీ బిందెలతో మహిళల నిరసన



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి - మైదుకూరు

తమకు తాగు నీటినివ్వాలని మైదుకూరు మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం స్థానిక 11, 12వ వార్డు మహిళలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ బోర్లు వేయడం చేతకాకుంటే చెప్పండి.. చందాలు వేసుకుని వేసుకుంటామని తెలిపారు. తాగునీటి సమస్యను తామే పరిష్కరించుకుంటామని ప్రజలు అధికారులను నిలదీశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. మున్సిపల్ అధికారులు శాశ్వత పరిష్కారం చూపకుండా, తాత్కాలిక పరిష్కారం చూపడంతో సమస్యకు పరిష్కారం లభించడం లేదన్నారు.

సమస్యను పరిష్కరిస్తాం

వేసవికాలం కావడంతో బోర్లల్లో నీటి శాతం తగ్గింది. ఈ నేపథ్యంలో సమస్య ఏర్పడింది. ట్యాంకర్ల ద్వారా ఇప్పటికే 11,12 వార్డుల్లో మంచినీటిని సరఫరా చేస్తున్నాం. ఇప్పటికే స్థానిక రైతులతో మాట్లాడి రెండు బోరు పాయింట్లతో కూడా నీటి సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. అవసరమైతే కొత్త బోరు వేసి నీటి సమస్యకు పరిష్కారం చూపిస్తాం.

- జబ్బార్‌మియా, మున్సిపల్ కమిషనర్

అవి రైతు వ్యతిరేక పార్టీలు : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి, టిడిపి, బిజెపి రైతు వ్యతిరేక పార్టీలను పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి తెలిపారు. స్థానికంగా మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రైతు మిత్ర పార్టీగా చెప్పారు. మోడీ, జగన్ ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాల వల్ల వ్యవసాయం గిట్టుబాటుకాక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు పెరిగాయన్నారు. రైతుల కోసం కాంగ్రెస్ పార్టీ 5 గ్యారంటీ పథకాలు ప్రకటించిందన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు అన్ని పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించనున్నట్లు తెలిపారు. రైతు రుణమాఫీ చేసేందుకు వ్యవసాయ కమిషన్ ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పంట నష్టం జరిగిన 30 రోజుల్లోనే రైతుల ఖాతాల్లో పంటల బీమా డబ్బులు జమ చేయడమన్నారు. వ్యవసాయ ఉత్పత్తులపై జిఎస్టీ మినహాయింపు అన్నారు. అయిదు గ్యారంటీలు అమలు చేయాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. కాంగ్రెసు పార్టీ అధికారంలోకి వచ్చేందుకు హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని తులసిరెడ్డి కోరారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం, రాజా, రామకృష్ణ, నరసింహరెడ్డి, బద్రి, ఉత్తన్న, వినయ్, బాలం సుబ్బ రాయుడు పాల్గొన్నారు.


అధికారంలోకి రాగానే రైతు సమస్యలు పరిష్కరిస్తాం

ప్రజాశక్తి - చక్రాయపేట

అధికారంలోకి రాగానే రైతు సమస్యలను పూర్తిగా పరిష్కరించేందుకు శ్రీకారం చుడుతామని పులివెందుల టిడిపి అభ్యర్థి బిటెక్ రవీంద్ర నాథ్‌రెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని ఎర్రబొమ్మన పల్లె పంచాయతీ సిద్ధారెడ్డిగారి పల్లెలో మంగళవారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రానున్నది తెలుగుదేశం పార్టీ అన్నారు. ఎక్కువ శాతం భూ సమస్యలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి కర్నాటి అమర్నాథ్‌రెడ్డి, మాజీ రాష్ట్ర ఆర్టికల్చర్ డైరెక్టర్ కర్నాటి నాగభూషణ్‌రెడ్డి, నియోజకవర్గ జనసేన అధ్యక్షుడు తుపాకుల చంద్ర, జిల్లా అధికార ప్రతినిధి పట్టం అశోక్‌కుమార్, మండల ఉపాధ్యక్షుడు ఎద్దుల చంద్ర, రామాం జనేయరెడ్డి, మాజీ ఉప మండలాధ్యక్షుడు నరసింహులు, సురభి ఉప సర్పంచ్ దాసరి ఆంజనేయులు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు యోగేశ్వర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, శ్రావణ్ కుమార్ రెడ్డి, వేంపల్లె టిడిపి కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్, నిమ్మకాయల మహమ్మద్ దర్బార్, తెలంగాణ వలి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పులివెందులకు నీళ్లు ఇచ్చిన ఘనత టిడిపిదే : ఆర్ఎస్ఆర్

పులివెందులకు నీళ్లు ఇచ్చిన ఘనత టిడిపిదేనని టిడిపి జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సిద్దారెడ్డి గారిపల్లెలో మంగళవారం బాబు ష్యూరిటీ.. బాబు గ్యారెంటీ కార్యక్రమం



మాట్లాడుతున్న బిటెక్ రవి, ఆర్.శ్రీనివాసరెడ్డి

టిడిపి నేత భాస్కర్‌రెడ్డి (ఎల్ బిఆర్) ఆధ్వర్యంలో చేపట్టారు. ముఖ్య అతిథులుగా పులివెందుల అసెంబ్లీ అభ్యర్థి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. పులివెందుల నియోజకవర్గంలో చీనీ చెట్లు ఎండి పోతుంటే రైతులను ఆదుకునేందుకు గత టిడిపి ప్రభుత్వ పాలనలో నీటిని ఇచ్చిందన్నారు. 40ఏళ్లుగా రాజకీయల్లో ఉండి ప్రజాప్రతినిధులుగా ఉన్న వైఎస్ కుటుంబం రైతులకు నీళ్ల ఇవ్వని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. నియోజకవర్గంలో కరువు విలయతాండవం చేస్తుంటే కేవలం కరువు మండలంగా సిఎం జగన్ ప్రకటించడానికి మనస్సు రాలేదంటే ఆయనేం ముఖ్యమంత్రి అని ఎద్దేవా చేశారు. సొంత నియోజకవర్గానికి ఏమీ చేశాడో చెప్పాలని ఆయన ప్రశ్నించారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలి

- పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి పిలుపు

ప్రజాశక్తి - కడప అర్బన్

జనసేన, టిడిపి, బిజెపి అభ్యర్థులను గెలిపించాలని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి పిలుపు నిచ్చారు. మంగళవారం నగరం లోని కింగ్స్ ప్యాలస్ ఫంక్షన్ హాల్‌లో జనసైనికుల ఆత్మీయ సమావేశం రాయలసీమ ఎన్నికల కార్యక్రమాల కమిటీ కో-కన్వీనర్ పంద్రా రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జనసేన కార్యకర్తలతో మూడు తీర్మానాలు చేయించారు. పవన్ కళ్యాణ్ పిలుపుమేరకు జనసేన పార్టీ ఓట్లన్నీ జనసేన, టిడిపి, బిజెపి, బలపరిచిన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి మాధవికి వేసే విధంగా ప్రతి ఒక్క జన సైనికుడు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి హరిప్రసాద్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బారెడ్డి, బిజెవైఎం జిల్లా అధ్యక్షులు బొమ్మన విజయ్, జనసేన నాయకులు తుంగ రమణ, అబ్బన్న గారి రాజగోపాల్, సాయి కష్ణ ఆచారి, రాజశేఖర్, బాలు నాయక్, కుమార్ నాయక్, మనీ, సాయి స్వరూప్, సిద్ధార్థ, తోట సుమన్, లోకేష్, సద్దాం, రామకష్ణ, దేవకుమార్, వంశీకష్ణ, టిడిపి నాయకులు బండి బాబు, బిజెపి నాయకులు చలపతి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

రక్తహీనతతో ఏ తల్లీ మరణించకూడదు

కడప అర్బన్ : జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు తన ఛాంబర్‌లో ముద్దనూరు, వద్దిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మాతృ మరణాలపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, ఇంటి వద్ద సిబ్బంది అందించిన సేవలపై ఆరా తీశారు. రక్తహీనత ద్వారా ఏ తల్లి మరణించకూడదని, రక్తహీనతను గర్భిణి నమోదు సమయం నుంచి ప్రతినెల పరీక్ష నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రతి నెలా 9న నిర్వహించే ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో స్త్రీల వ్యాధి నిపుణుల ద్వారా క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. మాతృ మరణాలు తగ్గడానికి నివారణ చర్యలు, గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు సిబ్బంది చేపట్టాలన్నారు. ఈ సమీక్షలో డిసిహెచ్ఎస్ డాక్టర్ హిమదేవి, జిల్లా టీకాల అధికారి డాక్టర్ ఉమా మహేశ్వర కుమార్, డాక్టర్ నీలిమ, డాక్టర్ సునీల్, డాక్టర్ ఎస్.సూర్యప్రకాశ్ రెడ్డి, అనస్థియ, స్త్రీల వ్యాధి, డాక్టర్ శాంతి కళ, డిప్యూటీ జిల్లా వైద్యాధికారి అరుణ, డిప్యూటీ మాస్ మీడియా అధికారిని రమణమ్మ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు, సిబ్బంది, మరణించిన వారి బంధువులు పాల్గొన్నారు.

శవ రాజకీయాలు చేయడం టిడిపికి అలవాటు

కడప : శవ రాజకీయాలను చేయడం టిడిపికి అలవాటుగా మారిందని వైసిపి కడప, రాజంపేట పార్లమెంట్ల రీజినల్ కో-ఆర్డినేటర్ కె. సురేష్ బాబు అన్నారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రిగా వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచి ఇచ్చిన హామీలన్నీ తూచా తప్పకుండా నెరవేర్చారని అన్నారు. నవరత్నాల పథకాల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించినట్లు చెప్పారు. వైసిపి నేతలు భూ కబ్జా చేశారని టిడిపి ఆరోపించడం సరైందని కాదని పేర్కొన్నారు. బిసి కులాలలో నామినేటెడ్ పదవులు ఇచ్చి వారిని అందలం ఎక్కించిన పార్టీ వైసీపీనే అని అన్నారు. చేనేతలకు 90 వేల మందికి చేనేత హస్తం పథకం ద్వారా అండగా ప్రభుత్వం నిలబడిందన్నారు.

వైసిపిలో ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం



నియామక పత్రం అందజేస్తున్న అంజాద్ బాషా, సురేష్ బాబు

ప్రజాశక్తి - కడప అర్బన్

వైసిపిలో కష్టపడ్డ వారికి సముచిత స్థానం కల్పిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి అంజద్ బాషా స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా కడప మాసాపేటకు చెందిన సీనియర్ నాయకుడు గుండ్లపల్లి గరుడాద్రిని ఎంపిక చేశారు. అపూర్వ కళ్యాణ మండపంలో సురేష్ బాబు, అంజాద్ బాషాల చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో నిర్వహించబోయే ఎన్నికలలో వైసిపి విజయానికి ప్రతి ఒక్కరికి కృషి చేయాలని సూచించారు. వైసిపిని నమ్ముకున్న ప్రతి ఒక్కరికి అండగా ఉండడంతో పాటు న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులైన గుండ్లపల్లి గరుడాద్రిని నేతలు ఘనంగా సత్కరించారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్, ఉప ముఖ్యమంత్రి అంజద్ బాష, కడప ఎంపీ అవినాష్ రెడ్డి, మేయర్ సురేష్ బాబుతో పాటు ఇతర నాయకులకు గరుడాద్రి ధన్యవాదాలు తెలిపారు .కార్యక్రమంలో నగర అధ్యక్షుడు సుబ్బారెడ్డి, సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, మార్కెట్ యార్డ్ చైర్మన్ బంగారు నాగయ్య యాదవ్, నాయకులు జయచంద్రారెడ్డి, తోటా కృష్ణ, రామ్మోహన్ రెడ్డి, దాసరి శివ, సాయి హుస్సేన్, ఎల్లారెడ్డి, రమేష్ రెడ్డి, సాయి దత్త, మధు, కార్పొరేటర్లు బాలకృష్ణారెడ్డి, రామలక్ష్మణ రెడ్డి, త్యాగరాజు, కార్పొరేటర్లు, ఎస్సీ సెల్ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిడిపిఒ సునీత

శిశు లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

ప్రజాశక్తి - వేంపల్లె

గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చేయించడం నేరమని ఐసిడిఎస్ సిడిపిఒ సునీత పేర్కొన్నారు. భేటీ బచావో.. బేటి పడవో కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక వైఎస్ఆర్ సభా భవనంలో వేంపల్లె, చక్రాయపేట మండలాల అంగన్వాడీ కార్యకర్తలకు, మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల చట్టాలను అంగన్వాడీ కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆడ పిల్లలను గౌరవించాలన్నారు. మహిళల రక్షణ కోసం ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో ఆడ పిల్లలు జాబితాను పొందుపరచాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సలర్ మహేష్, సూపర్‌వైజర్లు డాక్టర్ స్వర్ణలత, సుభాషిణి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రచారంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

కొండాపురం : కొండాపురం మండలం సుగుమంచిపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవానం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రతి ఒక్కరిని ఆత్మీయంగా పలకరించారు. ఆయన జనంతో మమేకమై ఎమ్మెల్యేగా మళ్లీ తననే గెలిపించాలని సుధీర్‌రెడ్డి కోరారు. జగనన్న ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించారు. ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిని కూడా గెలిపించాలన్నారు. కార్యక్రమంలో రాజారెడ్డి, రాష్ట్ర కనీస వేతనాల కమిటీ చైర్మన్ రఘునాథరెడ్డి, మండల కన్వీనర్ జగదీశ్వర్‌రెడ్డి, శ్రీరంగరెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, ఆది బ్రదర్స్, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్చకులపై దాడి అమానుషం

వేంపల్లె : కాకినాడ శివాలయంలో అర్చకులు సాయిశర్మ, విజయ మోహన్‌శర్మలపై దాడి అమానుషమని బ్రహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాద్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్చకులపై భౌతిక దాడులు చేయడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. అర్చకత్వంలో పొరపాట్లు ఉంటే అధికారులకు ఫిర్యాదు చేయాలే కానీ, భౌతిక దాడులకు దిగడం దారుణమమన్నారు. దాడి చేసిన మాజీ కార్పొరేటర్ సిరిమాల చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కూడా వైసిపి నాయకులు దాడులు చేయడం వారి బరి తెగింపునకు నిదర్శనమన్నారు. బ్రహ్మణులపై జరుగుతున్న దాడులను ముక్త కంఠంతో అందరూ ఖండించాలని ఆయన కోరారు.



డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న మేకల శివార్జున

మూల్యాంకన కేంద్రంలో సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

పదవ తరగతి మూల్యాంకన కేంద్రంలో సౌకర్యాలు కల్పించాలని ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం నాయకులు కోరారు. మంగళవారం డిఇఒ అనురాధకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున మాట్లాడుతూ 10వ తరగతి మూల్యాంకన కేంద్రంలో వేసవి దృష్టిలో ఉంచుకుని చల్లని నీరు, మజ్జిగ, అవసరమైన సౌకర్యాలను ఉపాధ్యాయులకు సమకూర్చాలని కోరారు. గత సంవత్సరం మూల్యాంకన విధులలో పాల్గొన్న కొంతమందికి రెమ్యూనరేషన్ రాలేదని చెప్పారు. వారికి వెంటనే చెల్లించాలని కోరారు. ప్రస్తుతం మూల్యాంకన విధులలో పాల్గొన్న ఉపాధ్యాయులకు మొదటి ప్రాధాన్యత కల్పించి రెమ్యూనరేషన్ ఇవ్వాలని చెప్పారు. 10వ తరగతి పాఠాలు బోధించే వారికి మూల్యాంకన విధులలో తీసుకోవడంలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. సీనియార్టీని దృష్టిలో ఉంచుకుని విధులలో తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ పి. శేషగిరిరావు, జిల్లా అధ్యక్షులు మేంద్రగుత్తి గంగరాజు, జిల్లా కార్యదర్శి సురేంద్ర పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్యలపై యువత ఉద్యమించాలి : డివైఎఫ్ఐ

పోరుమామిళ్ల: కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ కోసం నిరుద్యోగ యువతీ యువకులు ఉద్యమించాలని భారత ప్రజాతంత్ర యు వజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని యువకుల సమావేశం ఎం. సుందరయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాదిమంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని తెలిపారు. జిల్లాలో చదువుకున్న నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు లేకపో వడంతో ఇతర దేశాలకు ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లి జీవిస్తున్నారని అన్నారు. జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు అయితే చదువుకున్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగ అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధి, పరిశ్రమల కోసం యువతి యువకులు ఉద్యమించి పరిశ్రమలు సాధించుకోవాలన్నారు. కాబట్టి జిల్లాలో ఉక్కు పరిశ్రమ కోసం ప్రతి ఒక్కరు పార్టీలకు అతీతంగా పోరాడాలన్నారు. అనం తరం డివైఎఫ్ఐ పోరుమామిళ్ల మండల కమిటీ ఎన్నుకున్నారు. డివైఎఫ్ఐ మండల అధ్యక్షుడిగా ఎం రత్నమయ్య, కార్యదర్శిగా ఎం సుందరయ్య, ఉపాధ్య క్షులుగా రామయ్య అనీఫ్, సహాయ కార్యదర్శులుగా కె కిరణ్, ఏ.అక్రమ్, ట్రెజ రర్‌గా శివ మరో పది మందిని కమిటీ సభ్య లుగా ఎన్నుకున్నారు.

నేటి నుంచి ఒంటి పూట తరగతులు

ప్రజాశక్తి - కడప అర్బన్ :

యోగివేమన విశ్వవిద్యాలయ పీజీ కళాశాలలో ఈ నెల 27 నుంచి ఒంటిపూట తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు తరగతులు ఉంటాయని తెలిపారు. వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా విద్యార్థుల సౌకర్యార్థం ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. బోధ నేతర సిబ్బంది యథా విధిగా ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని వేళలు ఉంటాయని తెలిపారు.